ముగిసిన జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్


విజేతలకు బహుమతులు అందజేస్తున్న పీఎన్‌బి మెట్‌లైఫ్ బృందం

అడ్డగుట్ట: ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవడంతో పాటు మానసిక, శారీరక సామర్థ్యాల సమగ్ర అభివృద్ధికి క్రీడలు దోహదపడుతాయని ఏషియన్ గేమ్స్ స్వర్ణ పతక విజేతలు సాత్విక్ సాయిరాజ్ రెడ్డి, చిరాగ్ షెట్టిలు పేర్కొన్నారు. సికింద్రాబాద్‌లోని ఆర్‌ఆర్‌సీ ఇండోర్ స్టేడియంలో శనివారం 8వ ఎడిషన్ పీఎన్‌బి మెట్‌లైఫ్ జూనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌సిప్(జేబీసీ) గ్రాండ్ ఫినాలేతో పాటు ముగింపు వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన సాత్విక్ సాయిరాజ్ రెడ్డి మాట్లాడుతూ జూనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొన్న యువకులు అద్భుతమైన ప్రతిభ, ఉత్సాహాన్ని చూడటం ఎంతో స్ఫూర్తిదాయకంగా నిలిచిందన్నారు. చిరాగ్ షెట్టి మాట్లాడారు యువ ఆటగాళ్లు ప్రదర్శించిన శక్తి, నైపుణ్యాల గురించి ఎంత చెప్పినా తక్కువేనని అన్నారు. అనంతరం, విజేతలుగా నిలిచిన క్రీడాకరులకు మెడల్స్‌తో పాటు జ్ఞాపికలు అందజేశారు. ఇన్సూరెన్స్ బ్యూరో ఆఫ్ ఇండియా సీఈఓ వెంకట్ చంగవల్లి, పీఎన్‌బి మెట్‌లైఫ్ ఎండి సమీర్ బన్సల్ పాల్గొన్నారు.

స్థానికులకే డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు

ఎమ్మెల్యే శ్రీగణేష్

రసూల్‌పురా: కంటోన్మెంట్ నియోజకవర్గంలో ఖాళీగా ఉన్న డబుల్‌బెడ్‌రూం ఇండ్లను స్థానికంగా ఉన్న లబ్ధిదారులకు అందజేస్తామని ఎమ్మెల్యే శ్రీగణే,ష్ హామీచ్చారు. మూసి నాలా వెంట ఉన్న నిర్మాణాలను కూల్చి నిర్వాసితులకు మడ్‌ఫోర్ట్ శ్రీరాంనగర్, గాంధీనగర్ డబుల్ బెడ్‌రూం ఇండ్లు కేటాయించనున్నారని ప్రచారం జరగడంతో పాటు గత రెండు రోజులుగా రెవెన్యూ, గృహ నిర్మాణ విభాగం అధికారులు ఖాళీగా ఉన్న గృహాలకు విద్యుత్ సౌకర్యం కల్పించడం, వాటిని తమ ఆధీనంలోకి తీసుకుంటుండడంతో శనివారం స్థానికంగా ఉన్న పలువురు లబ్ధిదారులు బోర్డు మాజీ సభ్యురాలు అనిత ప్రభాకర్ ఆధ్వర్యంలో ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న శ్రీగణేష్ గాంధీనగర్ కు రావడంతో.. ఇప్పటివరకు తమకు డబుల్‌బెడ్‌రూం ఇండ్లు ఇవ్వలేదని ఇపుడు బయటి వ్యక్తులకు ఇస్తే తాము ఊరుకునేది లేదని లబ్ధిదారులు హెచ్చరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌ల దృష్టికి సమస్యను తీసుకెళ్లానన్నారు. స్థానికులకే ఇండ్లు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని మంత్రులు జిల్లా కలెక్టర్ అనుదీప్‌కు ఆదేశించారని లబ్ధిదారులు ఆందోళన చెందవద్దని కోరారు. మధ్యవర్తు లను ఆశ్రయించవద్దని, ఎవరికి డబ్బులు ఇవ్వోద్దని ఎమ్మెల్యే సూచించారు.


లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

నవరాత్రోత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలి


మాట్లాడుతున్న ఏసీపీ జైపాల్‌రెడ్డి

అడ్డగుట్ట: దుర్గామాత నవరాత్రోత్సవాలను శాంతియుతమైన వాతావరణంలో జరుపుకోవాలని చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డి సూచించారు. శనివారం లాలాగూడ పోలీస్‌స్టేషన్ ఆవరణలో దుర్గామాత మండప నిర్వాహకులు, మైత్రి కమిటీ సభ్యులతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా ఏసీపీ జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ దుర్గామాత నవరాత్రి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలన్నారు. ఎట్టిపరిస్థితుల్లో డీజేలు, ప్యాడ్ బ్యాండ్లను అనుమతించేది లేదని తేల్చిచెప్పారు. చివరి రోజు ఊరేగింపులో నిబంధనలు ఉల్లఘించి డీజే, ప్యాడ్ బ్యాండ్‌లు ఏర్పాటు చేస్తే నిర్వాహకులపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్‌ఐలు షాహీద్ పాషా, నాగరాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు

బ్రాహ్మణ పూజారులపై దాడులను అరికట్టాలి

సికింద్రాబాద్: బ్రాహ్మణ పూజారులపై హిందూ వ్యతిరేక శక్తులు జరుపుతున్న దాడుల నుంచి రక్షణ కల్పించాలని అందెపల్లి కనకదుర్గ బ్రాహ్మణ సేవా సంస్థ అధ్యక్షులు కుందేటి ప్రసాద్ శర్మ కోరారు. శనివారం వారాసిగూడలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తమ సంఘం తరుపున 13 సంవత్సరాలుగా సనాతన ధర్మం ప్రకారం నగరంలోని బ్రాహ్మణ కుటుంబాలకు పితృ పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాల వల్ల తమకు ఇబ్బందులు, ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని ఆరోపిస్తూ చుట్టుపక్కల వారు తమపై ఈ నెల 26న దాడి చేసినట్లు తెలిపారు. తాము ఇక్కడ క్షుద్ర పూజల చేయడం లేదని కేవలం హిందూ ధర్మం ప్రకారం పూజలు చేయడం చూసి హిందూ వ్యతిరేక శక్తులు కావాలనే తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని చెప్పారు.


సమావేశంలో మాట్లాడుతున్న కుందేటి ప్రసాద్ శర్మ

హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలం


కాలనీ వాసులతో సమావేశంలో మాట్లాడుతున్న బోర్డు సభ్యుడు రామకృష్ణ

కంటోన్మెంట్: ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కంటోన్మెంట్ బోర్డు సభ్యుడు రామకృష్ణ అన్నారు. మీట్ యువర్ మెంబర్ కార్యక్రమంలో భాగంగా శనివారం ఆరోవార్డు పరిధిలోని జూపిటర్ కాలనీ, కిరణ్ ఎన్‌క్లేవ్, వాహిని కాలనీ, రాధా స్వామి, రైల్ ఎన్‌క్లేవ్ కాలనీవాసులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్బంగా స్థానికులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ అధికారంలోకి రాకముందు అనేక హామీలిచ్చిన కాంగ్రెస్ పార్టీ, తీరా అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కంటోన్మెంట్ నియోజక వర్గంలో ప్రధానంగా త్రాగునీటి సమస్య ఉందని, కానీ రాష్ట్ర ప్రభుత్వం కంటోన్మెంట్ ప్రజలకు సరిపడ త్రాగునీరు సరఫరా చేయడం లేదన్నారు. కంటోన్మెంట్ ప్రజల నీటి సమస్యకోసం ఎక్కడివరకైనా వెళ్తామని కచ్చితంగా ప్రజలకు సరిపడ నీరు అందేలా చూస్తానని హామీ ఇచ్చారు.కంటోన్మెంట్ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నయా పైసా ఇవ్వకుండా చోద్యం చూస్తుందని అన్నారు.

సంతానోత్పత్తి సవాళ్లను అధిగమించాలి

సనత్‌నగర్: సంతానోత్పత్తి సవాళ్లను అధిగమించాల్సిన అవసరం ఉందని కిమ్స్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ భాస్కర్‌రావు తెలిపారు. 'ఫెర్టిలిటీ ప్రిజర్వేషన్ సొసైటీ ఆఫ్ ఇండియా–ఫెర్టిప్రొటెక్ట్ 2024' అంతర్జాతీయ వార్షిక సమావేశం శనివారం సాయంత్రం బేగంపేటలోని హోటల్ వివంతాలో ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా హాజరైన భాస్కర్‌రావు మాట్లాడుతూ జ్ఞానం, పరిశోధనలు పంచుకోవడానికి ఈ సదస్సు ఎంతగానో దోహదం చేస్తుందన్నారు. వినూత్న పరిష్కారాలకు, రోగుల సంరక్షణకు ఇదో అద్భుతమైన అవకాశమన్నారు. ఫెర్టిప్రొటెక్ట్ 2024 ఆర్గనైజింగ్ చైర్‌పర్సన్, కిమ్స్ ఫెర్టిలిటీ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.వైజయంతి మాట్లాడుతూ ఈ సదస్సులో అంతర్జాతీయ నిపుణుల నుంచి విలువైన విషయాలు పొందే అవకాశం ఉందన్నారు. ఫెర్టిలిటీ ప్రిజర్వేషన్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ డాక్టర్ మాధురి పాటిల్ తదితరులు పాల్గొన్నారు.


సదస్సులో పాల్గొన్న కిమ్స్ చైర్మన్ భాస్కర్‌రావు తదితరులు

రేపు లేబర్ కమిషనర్ కార్యాలయం ముట్టడి

ఉస్మానియా యూనివర్సిటీ: వర్సిటీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని రేపు (30న) లేబర్ కమిషన్ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పద్మశ్రీ తెలిపారు. శనివారం వర్సిటీ క్యాంపస్‌లోని హాస్టల్స్, కార్యాలయాలు, కాలేజీలలో పర్యటించి ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కరపత్రాలను జారీ చేస్తు ప్రచారం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మహేందర్, సీతారాం, శ్రీధర్ రావు, శ్రీను, నాగరాజు, శివ, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

మందు గోలీలకూ దిక్కు లేదాయె..

గాంధీ ఆస్పత్రిలో మాజీ మంత్రి హరీశ్‌రావు

గాంధీ ఆస్పత్రి: రాష్ట్రంలో సర్కార్ వైద్యం అన్ని విధాలా విఫలమైందని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందుల కొరత తీవ్రంగా ఉందని, సాధారణమైన పారాసిటమల్ గోలీ కూడా నిరుపేదలకు ఉచితంగా అందించే పరిస్థితి లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు ధ్వజమెత్తారు. కష్టపడి కట్టుకున్న ఇళ్లను హైడ్రా కూల్చేస్తుందనే భయాందోళనకు గురై ఆత్మహత్యకు పాల్పడిన బుచ్చమ్మ మృతదేహానికి నివాళు లర్పించి, బాధిత కుటుంబసభ్యులను పరామర్శించేందుకు ఎమ్మెల్యేలు సబిత ఇంద్రారెడ్డి, మాధవరం కృష్ణారావులతో కలిసి శనివారం గాంధీఆస్పత్రికి వచ్చారు. ఆస్పత్రి ప్రాంగణంలో ప్రైవేటు మెడికల్ షాపుల వద్ద నిరుపేద రోగులు పెద్దసంఖ్యలో గుమిగూడి మందులు కొనుగోలు చేస్తున్న దృశ్యాన్ని చూసిన ఆయన ఓ ప్రైవేటు మెడికల్ షాపునకు వెళ్లి రోగులతో ముచ్చటించారు. పారాసిటమల్ వంటి సాధారణ మందులు కూడా లేవని, ప్రైవేటు షాపుల్లో కొనుక్కోమని ఉచిత సలహా ఇస్తున్నారని పలువురు రోగులు హరీష్‌రావు దృష్టికి తెచ్చారు. డెంగ్, మలేరియా, టైఫాయిడ్, చికెన్ గున్యా వంటి విషజ్వరాలు వ్యాపిస్తున్న తరుణంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో పారాసిటమల్‌గోళి కూడా లేకపోవడం ఏమిటని హరీష్‌రావు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఓ రోగి ఓపీ చిట్టీలో రాసిన ఐదు మందులు గాంధీ ఫార్మసీలో అందుబాటులో లేవని హరీష్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. నిరుపేద రోగులపై రేవంత్ సర్కార్ పెనుభారం మోపుతుందని, ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రులకు వెళ్లలేని నిరుపేదలే సర్కార్ దవఖానకు వస్తారని, ఇక్కడకు వస్తే మందులు లేవని చావుకబురు చల్లగా చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి ప్రభుత్వ ఆస్పత్రులు, బస్తీదవఖాన, యుపీహెచ్‌సీ, పీహెచ్‌సీల్లో అన్నిరకాల మందులు అందుబాటులోకి తేవాలని, నిరుపేదల రక్తం తాగుతున్న రేవంత్ సర్కార్ ఇకనైన తమ తీరు మార్చుకోవాలని సూచించారు. అనంతరం పలువురు రోగులు, ప్రైవేటు మెడికల్ షాపుల నిర్వాహకులతో పలు అంశాలపై చర్చించారు.


గాంధీ ఆస్పత్రి ప్రాంగణంలో మందుల కొరతపై ఆరా తీస్తున్న హరీష్‌రావు, సబిత ఇంద్రారెడ్డి

నవరాత్రి ఉత్సవాలకు మంత్రికి ఆహ్వానం



రాంగోపాల్‌పేట్: అక్టోబర్ 3 నుంచి 12వ తేదీ వరకు సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి నవరాత్రి ఉత్సవాలకు హాజరు కావాలని కోరుతూ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆహ్వానం పలికారు. దేవాలయ ఈవో గుత్తా మనోహర్‌రెడ్డి, ప్రధాన అర్చకులు రామతీర్థ శర్మ, వేదపండితులు వేణుమాధవ శర్మ తదితరులు మంత్రిని కలిసి అమ్మవారి ప్రసాదాన్ని అందించారు. అనంతరం రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్ యాదవ్‌కు కూడా నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొనాలని ఆహ్వానం అందించారు.

శరన్నవరాత్రులకు పటిష్ట బందోబస్తు

చిలకలగూడ: దేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకుని చిలకలగూడ డివిజన్ పరిధిలో పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేపట్టామని ఏసీపీ జైపాల్‌రెడ్డి అన్నారు. చిలకలగూడ ఠాణా ప్రాంగణంలో శనివారం దుర్గామాత మండప నిర్వాహకులు, మైత్రి కమిటీ సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. బాణాసంచా, డీజేలకు అనుమతులు లేవని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. చిలకలగూడ ఇన్‌స్పెక్టర్ అనుదీప్, డీఐ రమేష్‌గౌడ్, ఎస్‌ఐలు జ్ఞానేశ్వర్, ఆంజనేయులు, సబితలతోపాటు పోలీస్ సిబ్బంది, మండప నిర్వాహకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.


సమస్యలు పరిష్కరించండి


మంత్రి జుపల్లికి వినతి పత్రం అందజేస్తున్న అధ్యాపకులు

ఉస్మానియా యూనివర్సిటీ: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంత్రి జూపల్లి కృష్ణారావుకు వర్సిటీల పార్ట్‌టైం అధ్యాపకులు శనివారం వినతి పత్రం సమర్పించారు. టీజీ ఆప్టా ఆధ్వర్యంలో మంత్రిని కలసి వారి సమస్యలను వివరించారు. కార్యక్రమంలో రవీందర్‌గౌడ్, నాగేందర్, కుమారస్వామి, శ్రీలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా కాన్వొకేషన్ వేడుకలు

అమీర్‌పేట: మాన్సస్ ఆఫ్ ఎక్సలెన్స్ స్కూల్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కాన్వొకేషన్ వేడులు ఘనంగా నిర్వహించారు.అమీర్‌పేట గ్రీన్‌పార్క్ మేరిగోల్డ్ హోటల్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో ఎంబీఏ, బీబీఏ గ్రాడ్యుయేట్లను అవార్డులతో సత్కరించారు. డీన్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేసిన తలసాని

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ మోండా మార్కెట్ డివిజన్ ఓల్డ్‌జైలు ప్రాంతంలో ప్రహరీ కూలిన సంఘటనలో బాధితులకు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ శనివారం ఆర్థిక సహాయం అందజేశారు. వ్యక్తిగతంగా ఒక్కో బాధిత కుటుంబానికి రూ. 20వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఓల్డ్ జైలు ప్రహరీ కూలి 6 టైలరింగ్ దుకాణాలు దెబ్బతిన్నాయి. 6 కుటుంబాలు రోడ్డు న పడ్డాయి. దీంతో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ బాధిత కుటుంబాలను ఆదుకుంటానని హామీ ఇచ్చారు. ఈ మేరకు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నాగులు, స్కైలాబ్, రాములు, మహేందర్, మహేష్, జయరాజ్, మేరు సంఘం నాయకులు శ్రీనివాస్, వెంకటేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్

రూ.7.30 లక్షలతో ఫ్లోరింగ్ పనులు


భవానీనగర్‌లో నిర్మాణ పనులు పరిశీలిస్తున్న దృశ్యం

చిలకలగూడ: సీతాఫల్‌మండి డివిజన్ భవానీనగర్‌లో రూ.7.30 లక్షల వ్యయంతో చేపట్టిన ఫ్లోరింగ్ నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ సామల హేమ శనివారం పరిశీలించారు. నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, త్వరితగతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. భవానీనగర్‌లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకుని, అధికారులతో చర్చించి పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. జీహెచ్‌ఎంసీ ఏఈ కౌషిక్, బీఆర్ఎస్ నాయకులు సాయియాదవ్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

డీజేలకు అనుమతి లేదు


మాట్లాడుతున్న ఏసీపీ జైపాల్‌రెడ్డి

బౌద్ధనగర్: నవరాత్రి ఉత్సవాలలో పోలీస్ నిబంధనలు అతిక్రమిస్తే ఉపేక్షించేది లేదని చిలకలగూడ ఏసీపీ జైపాల్ రెడ్డి హెచ్చరించారు. శనివారం వారాసిగూడ పోలీస్‌స్టేషన్‌లో మైత్రి కమిటీ, అమ్మవారి మండప నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా ఏసీపీ మాట్లాడుతూ రానున్న దేవి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని మండప నిర్వాహకులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను పాటించాల్సిన సూచనలు వివరించారు. మండపం ఏర్పాటు చేసే వారు పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలన్నారు. నవరాత్రుల అనంతరం ఊరేగింపులో ఎట్టిపరిస్థితుల్లో డీజేలు పెట్టవద్దన్నారు. బాణాసంచాలు కూడా కాల్చవద్దన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వీటిని అనుమతించడం లేదన్నారు. రూల్స్‌ను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఇన్‌స్పెక్టర్ సైదులు, ఎస్‌ఐ సుధాకర్‌లు పాల్గొన్నారు.

ఇఫ్లూలో సఫాయిమిత్ర సురక్షా శివిర్ ప్రారంభం

ఉస్మానియా యూనివర్సిటీ: ద ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజస్ సెంట్రల్ యూనివర్సిటీ (ఇఫ్లూ)లో సఫాయి మిత్ర సురక్షా శివిర్ కార్యక్రమాన్ని కేంద్ర విద్యాశాఖ సహాయం మంత్రి డాక్టర్ సుకంత ముజుందార్ ప్రారంభించారు. శనివారం ఇఫ్లూ క్యాంపస్‌లో స్వచ్ఛత హీ సేవ–2024 కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఇంచార్జి వీసీ ప్రొ. హరిబండి లక్ష్మి అధ్యక్షత వహించగా కేంద్ర మంత్రి డాక్టర్ సుకంత ముజుందార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్‌ఈపీ–2024 అమలులో ఇఫ్లూ ముందంజలో ఉందని ప్రశంసించారు. అనంతరం వర్సిటీ ప్రాంగణంలో మొక్కను నాటి గ్రంథాలయంలో రీడింగ్ రూం ప్రారంభించారు. ఈ సందర్బంగా సఫాయి కిట్లను పంపిణీ చేశారు.



సఫాయి కిట్లను అందచేస్తున్న కేంద్ర మంత్రి డాక్టర్ సుకంత ముజుందార్

అప్పుల బాధతో తల్లి, కుమారుడి ఆత్మహత్య

బౌద్ధనగర్: అప్పుల బాధ భరించలేక పురుగుల మందు తాగి తల్లీ కొడుకులు ఆత్మహత్య చేసుకున్న సంఘటన వారాసిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సైదులు తెలిపిన వివరాల ప్రకారం..సికింద్రాబాద్ పార్శిగుట్టలోని న్యూ అశోక్‌నగర్‌కు చెందిన నంపరి జయలక్ష్మి(63), రవికాంత్ (36) తల్లీ కొడుకులు. రవికాంత్ ప్రైవేటు ఉద్యోగి కాగా జయలక్ష్మి గృహిణి. వీరు అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. రెండేళ్ల క్రితం రవికాంత్ తండ్రి చనిపోయాడు. దీంతో కొంత కాలంగా అప్పుల బాధతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో తీవ్ర మనస్థాపానికి గురైన ఇద్దరు శనివారం సాయంత్రం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. మధ్యాహ్నం నుండి ఇంట్లో నుంచి ఎవరూ బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చిన ఇంటి యజమాని వారి గది వద్దకు వెళ్లి తలుపులు తట్టాడు. ఎంతసేపటికి తీయకపోవడంతో డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు తలుపులు పగులకొట్టి లోపలికి వెళ్లి చూడగా తల్లీ కొడుకులు ఆత్మహత్య చేసుకొని కనిపించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాలను గాంధీ ఆసుపత్రికి తరలించారు.


తల్లీ కొడుకుల మృతదేహాలు

కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో టమాటా రూ.47, నల్లవంకాయ 35, పొడుగు వంకాయ 28, బెండకాయ 40, పచ్చిమిర్చి 28, బజ్జీమిర్చి 70, క్యాప్సికమ్ 65, పచ్చకాకర 35, పందిరి బీర 28, క్యాబేజీ 19, క్యారెట్ 37, దొండ 35, గుండుబీన్స్ 55, గింజ చిక్కుడు 50, గోకరకాయ 35, కీర 18, దోసకాయ 28, బీట్‌రూట్ 28, ఉల్లిగడ్డ 50, ఆలుగడ్డ 37, చామగడ్డ 35, మొరంగడ్డ 45, కందగడ్డ 55, సొరకాయ 13, పొట్లకాయ 18, అరటికాయ 10, మునగకాయ 5–6, ముల్లంగి 5–6.

నేడు ఉచిత ఆక్యుపంక్చర్ వెల్‌నెస్ క్యాంప్

సనత్‌నగర్: బేగంపేట ప్రకాష్‌నగర్‌లోని ఎస్సీ, బీసీ కమ్యూనిటీ హాల్‌లో శ్రీనివాస గౌర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత ఆక్యుపంక్చర్ వెల్‌నెస్ క్యాంప్‌ను నిర్వహించనున్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే ఈ శిబిరంలో మల్టీ థెరపీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ వైద్యులు హాజరై సేవలు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే మధ్యాహ్నం 12 ఉంచి శ్రీనివాస గౌర ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు.

గుండె ఆరోగ్యంపై అవగాహన వాక్



అమీర్‌పేట: గుండె ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో 2కె వాక్ నిర్వహించారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా శనివారం అమీర్‌పేట ఆసుపత్రి నుండి పంజగుట్ట చౌరస్తా వరకు వాక్ చేపట్టారు. ఈ సందర్భంగా కార్డియాలజిస్ట్ డా.సాకేత్ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో వృద్ధులే కాకుండా యువతలో సైతం గుండె జబ్బుల ప్రమాదం వేగంగా పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. సెప్టెంబర్ 29న ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు.

బ్యాంక్ ఆఫ్ బరోడా ఆధ్వర్యంలో 'సంపూర్ణ స్వచ్ఛత'



సాక్షి, సిటీబ్యూరో: బ్యాంక్ ఆఫ్ బరోడా హైదరాబాద్ మెట్రో రీజియన్ ఆధ్వర్యంలో శనివారం 'సంపూర్ణ స్వచ్ఛత' కార్యక్రమాన్ని నిర్వహించారు.దేశవ్యాప్తంగా చేపట్టిన పరిశుభ్రత ఉద్యమం స్వచ్ఛ హీ సేవా–2024 కార్యక్రమంలో భాగంగా సికింద్రాబాద్ పద్మారావునగర్ పార్కులో చేపట్టిన సంపూర్ణ స్వచ్ఛత కార్యక్రమంలో బ్యాంకు అధికారులు, ఉద్యోగులు పాల్గొని శ్రమదానం చేశారు.అలాగే మొక్కలు నాటారు.బ్యాంక్ ఆఫ్ బరోడా రీజనల్ హెడ్ ఆదిత్య కన్నావీజియా ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌కు ఘన నివాళి



అమీర్‌పేట: భగత్‌సింగ్ జయంతి సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు ఘన నివాళులర్పించారు.అమీర్‌పేట మాజీ కార్పొరేటర్ ఎన్.శేషుకుమారి నాయకులతో కలిసి సత్యం థియేటర్ చౌరస్తాలోని భగత్‌సింగ్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో భగత్‌సింగ్ 117వ జయంతిని విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. శనివారం ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఏర్పాటు చేసిన భగత్‌సింగ్ చిత్రపటానికి పూల మాలాలు వేసి నివాళులర్పించి దేశ స్వాతంత్ర్యం కోసం ఆయన చేసిన పోరాటం, ప్రాణా త్యాగాన్ని కొనియాడారు. భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తిని నేటి యువత అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఓయూ అధ్యక్షులు లెనిన్, ఉదయ్ కుమార్, భగత్, అశ్వన్, రాధాకృష్ణ, మధు, లింగస్వామి, సలీం రాజు తదితరులు పాల్గొన్నారు.

ఓయూలో నేడు ఏచూరి సంస్మరణ సభ

ఉస్మానియా యూనివర్సిటీ: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంస్మరణ సభ ఆదివారం సాయంత్రం ఆర్ట్స్ కాలేజీ ఎదుట నిర్వహించనున్నట్లు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి శనివారం పేర్కొన్నారు. ఓయూ పూర్వవిద్యార్థిగా, ఎస్ఎఫ్ఐ జాతీయ మాజీ అధ్యక్షులుగా విద్యారంగ సమస్యల పై అనేక పోరాటాలు చేసిన ఏచూరి సంస్మరణ సభకు విద్యార్థులు, అధ్యాపకులు, ఉద్యోగులు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. సభలో తెలంగాణ సాయుధ పోరాట నాటిక ప్రదర్శనను నిర్వహించనున్నట్లు చెప్పారు.

గుర్రం జాషువా గొప్ప సాహితీ వేత్త

ఉస్మానియా యూనివర్సిటీ: గుర్రం జాషువా గొప్ప సాహితీ వేత్త అని ఓయూ తెలుగు శాఖ ప్రొ.కాశీం పేర్కొన్నారు. శనివారం ఆర్ట్స్ కాలేజీలో ఓయూ సాహితీ వేదిక ఆధ్వర్యంలో గుర్రం జాషువా 129వ జయంతిని జరుపుకున్నారు. వేదిక అధ్యక్షులు రాజీవ్ అధ్యక్షత వహించగా ప్రొ.కాశీం ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో మీసాల లక్ష్మన్, డా.విజలక్ష్మీ, డా.రఘు తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇండ్లను కూల్చివేయడం సరికాదు

ఉస్మానియా యూనివర్సిటీ: పేదల ఇండ్లను హైడ్రా అధికారులు కూల్చివేయడం సరికాదని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ శనివారం పేర్కొన్నారు. రోజువారీ పనులు, ప్రైవేటు ఉద్యోగులు చేసుకుంటూ పొట్టపోసుకునే పేదల నివాసాలను నిర్దాక్షిణ్యంగా కూల్చివేయడం క్షమించరాని నేరమన్నారు. ఇండ్ల నిర్మాణానికి అనుమతులు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

అడ్డగుట్ట: అప్పుల బాధ భరించలేక రైలు కిందపడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. కర్ణాటక రాష్ట్రానికి చెందిన జగన్నాథ్(49) కూలీ పని చేస్తుంటాడు. ఇతని భార్య ఐదుగులు పిల్లలు. ఆదాయానికి మించిన అప్పులు చేయడంతో కుటుంబపోషణ కష్టంగా మారింది. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన జగన్నాథ్ శుక్రవారం రాత్రి 10.45 గంటల సమయంలో ఘట్కేసర్ – బీబీనగర్ రైల్వే స్టేషన్ల మార్గం మధ్యలోని పట్టాలపై రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.